# ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తి

**వివరాలు వెల్లడించిన నంద్యాల**

**అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు**



**నంద్యాల,జూలై25.అక్షరటైమ్స్:-** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ--2026 కార్యక్రమం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో జూలై 24తో విజయవంతంగా పూర్తయిందని నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరిని ప్రత్యక్షంగా కలుసుకుని వివరాలను సేకరించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా వాటిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,76,813 మంది ఓటర్లు ఉండగా, వారందరికీ గణన పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అందులో 2,24,506 పత్రాల వివరాలను నమోదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పరిశీలనలో 10,489 మంది మరణించిన ఓటర్లు, 23,301 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు, 10,196 మంది గృహ సందర్శన సమయంలో అందుబాటులో లేని లేదా గైర్హాజరైన ఓటర్లు, 8,321 మంది ఇప్పటికే ఇతర నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదైన వారు గుర్తించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించే లక్ష్యంతో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తదుపరి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## సూర్యనారాయణ రెడ్డి ని కలసిన ముస్లిం మైనార్టీ నాయకులు





**బద్వేల్,జులై25.అక్షరటైమ్స్:-** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ మహబూబ్ భాషా (బిగ్ బాస్) ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ నాయకులు శనివారం బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులతో పలు అంశాలపై చర్చించిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముస్లిం మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మైనారిటీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పార్టీ బలోపేతానికి ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆర్యవైశ్య సంఘం & ఆవోపా ఆధ్వర్యంలో ఆర్థిక సాయం.!



**పులివెందుల/ప్రతినిధి, జూలై 25. అక్షరటైమ్స్:-** కడప జిల్లా పులివెందుల పట్టణం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంతంలో నివాసం ఉంటున్న కుప్పం ప్రసాద్ స్వగృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్,కారణంగా పూర్తిగా కాలిపోవడంతో నిరాసుడైన బాధితుడిని ఆదుకునేందుకు ఆర్యవైశ్య సంఘం, ఆవోపా కమిటీ సభ్యులు ముందుకు వచ్చారు. ఆవోపా సంఘం అధ్యక్షుడు దొంతు. మురళీమోహన్, ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మరియు దేశు. శ్రీనివాసులు, చేతులు మీదుగా కుప్పం ప్రసాద్ కు రూ. 10.వేల రూపాయల చెక్కు..ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మరియు ఆవోపా రాష్ట్ర సలహాదారుడు, మేడా. సాయిబాబా, వైయస్సార్ కడప జిల్లా సలహాదారుడు, జె.సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మరియు అవపా సంఘం అధ్యక్షుడు దొంతు మురళీమోహన్, వైస్ ప్రెసిడెంట్, పెనుజూరి. రమేష్ బాబు, కోశాధికారి, కందుకూరు. కేశవ సెక్రటరీ నామ జనార్ధన్ సలహాదారుడు సుబ్రహ్మణ్యం రాజోలి వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మాలేపాటి హరిబాబు ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు మరియు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నీటి సమస్య పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే కు విజ్ఞప్తి



**ప్రొద్దుటూరు,జూలై25.అక్షరటైమ్స్:** తమ ప్రాంతానికి నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని వెంటనే జోక్యం చేసుకుని నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ 9 వ వార్డు ప్రజలు మాజీ కౌన్సిలర్ జిలానీ బాషా ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ని కలిసి విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం శ్రీనివాస నగర్ ప్రజలు మాజీ కౌన్సిలర్ జిలానీ బాషా లు మీడియాతో మాట్లాడుతూ గత రెండు నెలలుగా నీటి సరఫరా లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపారు. మున్సిపల్ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకపోవడంతో విషయం ఎమ్మెల్యే దృష్టి కి తీసుకెళ్ళడం జరిగిందని పేర్కొన్నారు.

## ఘనంగా మంచా నాగ మల్లేశ్వరి జన్మదిన వేడుకలు



**ప్రొద్దుటూరు,జూలై25.అక్షరటైమ్స్:-** మాల మహానాడు జి.చెన్నయ్య వర్గం జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి పుట్టినరోజు వేడుకలు కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రొద్దుటూరులో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్, ప్రొటెక్షన్, కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, మేకల వెంకటన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా అధ్యక్షులు, జేష్ఠది భాస్కర్ మరియు, వెంకటన్న మాట్లాడుతూ నాగమల్లేశ్వరి దళితుల సమస్యల మీద, రెండు తెలుగు రాష్ట్రాలలో, మంచి పట్టున్న నాయకురాలు అని దళిత సమస్యల మీద పోరాడుతున్న నాయకురాలని, కొనియాడారు. తదుపరి కేకు కట్ చేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు, జేష్ఠది మధు, ప్రొద్దుటూరు పట్టణ యూత్ ప్రెసిడెంట్ జాస్వర్, ప్రొద్దుటూరు తాలూకా యూత్ ప్రెసిడెంట్, మోపురి పుష్పరాజ్, ప్రొద్దుటూరు పట్టణకార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


## తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ వృషభాచలేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు

**వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవం**

**ఈవో కె. సుభాష్, చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు**







**వేంపల్లె,జూలై25.అక్షరటైమ్స్:-** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు లోకకళ్యాణం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వృషభాచలేశ్వర స్వామివారికి రెండు రోజులపాటు అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. సుభాష్, ఆలయ చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరి ప్రవీణ్, తిరుమల వేణు ఆధ్వర్యంలో అర్చక బృందంచే గణపతి పూజ, పుణ్యాహవాచనం, అష్టోత్తర శత కలశ ఆరాధన, ప్రధాన కుంభ ఆరాధన, శాంతి హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం విశేష ద్రవ్యాలతో నింపిన 108 కలశాలతో స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి), టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఇతర సౌకర్యాలను ఈవో కె. సుభాష్, చైర్మన్ పీవీ. రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎస్సై తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు జ్యోతి, రాజమ్మ, సునీల్, రామయ్య, వరాలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధస్తావేజు లేఖరుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మద్దతు



**నంద్యాల.జులై25.అక్షరటైమ్స్:-** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ధస్తావేజు లేఖరుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి నేడు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ధస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు ఈ నెల 20 నుంచి 31 వరకు చేపట్టిన 'పెన్ డౌన్' నిరసనలో ఆయన పాల్గొని వారి డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని ధస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా ధస్తావేజు లేఖర్ల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. సమ్మె విరమించాలని లేఖరుల సంఘ అధ్యక్షుడిపై నాయకులు ఒత్తిడి తెచ్చి బలవంతపెట్టడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం తమకు అనుకూలంగా లేకపోతే కేసులు పెట్టి వేధించే సంస్కృతికి స్వస్తి పలకాలన్నారు. డాక్యుమెంట్ రైటర్ల సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి నాయకులు స్పందించాలని కోరారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే ధస్తావేజులేఖర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ధస్తావేజులేఖరుల సంఘం ప్రతినిధులు, స్టాంప్ వెండర్స్ పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ అధ్యాపకులకు ప్రదోన్నతులు ఇవ్వాలి



నంద్యాల.జులై25.అక్షరటైమ్స్:- నంద్యాల జిల్లా,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు వెంటనే ప్రదోన్నతులు కల్పించాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 10, కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్క పాలిటెక్నిక్ అధ్యాపకులందరికీ సిఏఎఫ్, కేంద్రం ప్రమోషన్లు కల్పించాల్సి ఉందని వారు స్పష్టం చేశారు. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన ద్వారం ఎదుట అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. కొంత కాలంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలు పరిష్కారశీ కొరకు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతి యుతంగా నిరసన తెలియజేశారు. 2019 సంవత్సరము నుంచి అమలులోకి వచ్చిన పిఆర్సి బకాయిలను అర్హులైన అధ్యాపకులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పలుమార్లు మంత్రులకు ఉన్నత అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ ఆందోళన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ అధ్యాపకుల సంఘం ప్రతినిధులు డాక్టర్ కే సుధాకర్ రెడ్డి,కేవీ రవి కిరణ్, బి ఈశ్వరయ్య, మరియు ఇతర సభ్యులు అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విధ్యార్థి దశలోనే సేవలు అందించాలి: ఎన్ఎస్ఎస్ అధికారి గోవర్ధన్



**వేంపల్లె,జూలై25.అక్షరటైమ్స్:-** విధ్యార్థి దశ నుంచే సామాజిక సేవలను అందించాలని ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ అధికారి టి.గోవర్ధన్ వెల్లడించారు. శనివారం ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం -11 ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్ లోని ప్రాంగణ ప్రాంతాల్లో పెరుకుపోయిన కలుపు మొక్కలు, చెత్త చెదారాన్ని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ పరిశుభ్రమైన, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడుతాయని తెలిపారు. విధ్యార్థుల్లో పరిశుభ్రత పట్ల బాధ్యత, సేవాభావం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలుగుతోందన్నారు. స్వచ్ఛతను దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని విధ్యార్థులను సూచించారు.

## ఇంటర్ నుంచే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చదువులు కొనసాగించాలి: తహసీల్దార్ శివశంకర్ రెడ్డి**







**వేంపల్లె,జూలై25.అక్షరటైమ్స్:-** విద్యార్థులు ఇంటర్ స్థాయి నుంచే తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా చదువులు కొనసాగించాలని వేంపల్లి తహసీల్దార్ శివశంకర్ రెడ్డి సూచించారు. స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యే విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే మార్గమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడి, సమయపాలన అలవర్చుకుని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రఘునాథ్ రెడ్డి దంపతులు**



**వేంపల్లె,జులై25.అక్షరటైమ్స్:-** స్థానిక పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో టీడీపీ మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి సతీమణి పద్మావతమ్మ లు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రాకారోత్సవంలో పాల్గొని గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి పల్లకీ సేవలో భాగస్వాములయ్యారు. అనంతరం ఆలయ అర్చకులు రఘునాథ్ రెడ్డి దంపతులను దుశ్శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. సుభాష్, ఆలయ పాలకమండలి చైర్మన్ పీవీ రమణ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, ఆలయ పాలకమండలి సభ్యులు సుబ్రమణ్యం, జ్యోతి, రామయ్య, రాజమ్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం మెప్మా పీడీ వెంకటదాస్



**నంద్యాల,జూలై25.అక్షరటైమ్స్:**-ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)పై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటదాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం మెప్మా కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటదాస్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ద్వారా ప్రజలు అందించిన ఫిర్యాదుల పరిష్కారంపై తమ అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా నమోదు చేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలు ప్రభుత్వ సేవల నాణ్యతను పెంపొందించడంలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలకు రాజకీయ అడ్డంకులు: శిల్పా రవిచంద్ర

### 122 మంది మహిళలకు రూ.22.10 లక్షల రుణాల పంపిణీ



**నంద్యాల,జూలై25.అక్షరటైమ్స్:**- రాజకీయ కక్షలతోనే శిల్పా సేవా సమితి నిర్వహిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆరోపించారు. శిల్పా సేవా సమితి కార్యాలయంలో శిల్పా మహిళా సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 122 మంది మహిళా లబ్ధిదారులకు రూ.22.10 లక్షల విలువైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్కే వ్యవసాయ మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో శిథిలావస్థలో ఉన్న షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకుని సొంత నిధులతో మరమ్మతులు చేసి అభివృద్ధి చేశామని తెలిపారు. అక్కడ నిర్వహిస్తున్న శిల్పా సహకార సూపర్ మార్కెట్, శిల్పా మహిళా బ్యాంక్, నంది రైతు సహకార్ సేవలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని విమర్శించారు. శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అందుతున్న సేవలను అడ్డుకోవడం వల్ల ప్రజలకే నష్టం జరుగుతోందన్నారు. సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్న 40 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని, రైతుల స్థలాలను పార్టీ అవసరాలకు కేటాయించడం సరికాదన్నారు. ఖాళీ చేయించిన శిల్పా మహిళా సహకార బ్యాంక్‌ను త్వరలో పద్మావతి నగర్‌లో తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హరిలీల, మహిళా ఖాతాదారులు, శిల్పా సేవా సమితి సిబ్బంది పాల్గొన్నారు.

## 594 మొబైళ్లను బాధితులకు అందజేసిన ఎస్పీ

### రూ.1.06 కోట్ల విలువైన ఫోన్ల రికవరీ



**నంద్యాల, జూలై 25. అక్షరటైమ్స్:**- నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆరవ విడత మొబైల్ రికవరీ మేళాలో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరీ చేసిన 594 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ బాధితులకు అందజేశారు. వీటి మొత్తం విలువ రూ.1,06,92,590గా అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్త, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందం మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, తెలంగాణతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మొబైళ్లను రికవరీ చేసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారం ఉండటంతో వాటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. మొబైల్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని లేదా 9121101107 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి వివరాలు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు 4,189 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేయగా, వాటి మొత్తం విలువ రూ.7,95,87,519గా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల ఏఎస్పీ సుస్మిత , అదనపు ఎస్పీ ఖాదర్ భాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు పరిరక్షణకు మహాసత్యాగ్రహం

### ఉద్యమం కొనసాగుతుందన్న అఖిలపక్ష ఐక్యవేదిక



**నంద్యాల,జూలై25.అక్షరటైమ్స్:**- నంద్యాల మార్కెట్ యార్డు, నూనెపల్లె మార్కెట్ యార్డు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) పరిరక్షణ కోరుతూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మార్కెట్ యార్డు వద్ద మహాసత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. రైతు, ప్రజా, రాజకీయ సంఘాల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం మార్కెట్ యార్డును పరిరక్షించాలని, ఆర్ఏఆర్ఎస్‌లోని తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల భూములను రాజకీయ అవసరాలకు వినియోగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అఖిలపక్ష నాయకులు రైతుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

## ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రధాని నరేంద్ర మోడీ

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్



**కడప,జూలై25.అక్షరటైమ్స్:**- కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ స్పష్టం చేశారు. కడపలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ యువత, విద్యార్థుల ముందు నియంతృత్వ ఎన్డీఏ ప్రభుత్వం తల వంచక తప్పలేదని స్పష్టం చేశారు. విద్యార్థులు మొక్కవోని ధైర్యంతో పోరాటం చేసి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమించారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, మత విద్వేష పరిపాలన చేస్తున్న నరేంద్ర మోడీ కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎనిమిది వందల నగరాలు, పట్టణాలు గ్రామాలలో ఆగ్రహ వేషాలు ప్రదర్శిస్తూ ఉద్యమం తీవ్ర రూపం దాల్చినట్లు వెల్లడించారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు, దేశవాసులు తీవ్ర నిరసనలు, ఆగ్రహ వేషాలు, ఆందోళనలు చేశారన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ సమస్య పూర్తిగా సమసి పోలేదన్నారు. పార్లమెంటు ఆవరణలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ సీఎం గా గుజరాత్ లో ఏ విధంగా చేశారో అదే విధంగా జంతర్ మంతర్ లో పోరాటం చేస్తున్న విద్యార్థులు, యువతను ఉరితీసి కిందికి వేలాడదీసి యువతకు గుణపాఠం నేర్పాలని మీడియాతో చెప్పడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పీస్ గోయల్ ఈ విధంగా దేశ యువతను ఉద్దేశించి ఒక కిరాతకుడిలా మాట్లాడడం పై దేశవ్యాప్తంగా నిరసనలు హోరెత్తుతున్నాయ న్నారు. సదరు మంత్రి పీయూష్ గోయల్ ధమనకాండ ప్రకటనతో భారతీయ జనతా పార్టీ నాయకులు, మంత్రులు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల వైఖరి ప్రజలకు పూర్తిగా బహిర్గతమైందన్నారు. కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న యువతను అణిచివేసేందుకు హోంమంత్రి అమిత్ షా పూర్తిస్థాయిలో పోలీసులు, సిఆర్పిఎఫ్ బలగాలను దుర్వినియోగం చేశారన్నారు. వందల మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. అంతేకాకుండా సాయిల్ అనే విద్యార్థి కన్ను పోయి, అతడి శరీరమంతా పెల్లెట్ గన్స్ తో కాల్చడం వల్ల బాధపడుతున్న రాహుల్ గాంధీ మీడియా ముందు వెల్లడించారన్నారు. దీనికి హోంమంత్రి అమిత్ షా పూర్తిగా బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 12 సంవత్సరాల పాటు భారతదేశాన్ని సర్వం నాశనం చేసిన నరేంద్ర మోడీ, అమిత్ షా కు రాబోయే రోజుల్లో ప్రజలు భరతవాక్యం పలుకుతారని హెచ్చరించారు. విద్యార్థులపై దమనకుండా కొనసాగించిన హోం మంత్రి అమిత్ షాను కూడా వెంటనే మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పూర్తి స్థాయిలో అన్ని వర్గాల ప్రజల విశ్వాసం కోల్పోయిన ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు, మేధావులు అన్ని వర్గాల వారు చైతన్యవంతులై ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలో భాగస్వాములు కావడంతో నరేంద్ర మోడీ బెంబేలెత్తిపోయి అధికారం చేజారకుండా అపసోపాలు పడుతున్నాడని ఎద్దేవా చేశారు. మరె ంతో కాలం హోంమంత్రి అమిత్ షా,ప్రధాని నరేంద్ర మోడీ మనుగడ సాధించలేరని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధి ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే పేరుతో ఆర్థిక దోపిడి

### రీ సర్వే ప్రక్రియలో పారదర్శకత లోపం.!

### భూమి హద్దులు చూపడంలో అధికారుల నిర్లక్ష్యం..

### జాయింట్ ఎల్‌పిఎం నంబర్ల గందరగోళం..

### బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా.?



**ఎమ్మిగనూరు,జూలై25.అక్షరటైమ్స్:**- రైతుల ఆధార జీవన విధానమైనటువంటి భూమిపై ఆధారపడినప్పటికీ, అదే భూమి రికార్డులలో లోపాలు, అక్రమాలు చోటుచేసుకోవడం వల్ల వారు ప్రభుత్వ పథకాల నుంచి దూరమవుతున్నారు. భూమి సర్వే వంటి కీలక ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం రైతులను ఆర్థికంగా, పరిపాలనా పరంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతుల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉంది. ఇటువంటి తరుణంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కలుగొట్ల గ్రామంలో వెలుగు చూసిన ఒక సంఘటన గ్రామీణ భూ పరిపాలనలో ఉన్న లోపాలను స్పష్టంగా అద్దంపడుతుంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని కలుగొట్ల గ్రామంలో భూమి సర్వే ప్రక్రియపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూమి సర్వే పేరుతో రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కేవలం వ్యక్తిగత ఆరోపణలుగా కాకుండా, గ్రామీణ భూ పరిపాలనలో వ్యవస్థాత్మక లోపాలుగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా గ్రామ సర్వేయర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నాడు ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో కేసి జబ్బర్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. సత్యన్న మాట్లాడుతూ కలుగొట్ల గ్రామంలో సర్వే పేరుతో రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం జరుగుతోందని ఆరోపించారు. అలాగే కలుగొట్ల గ్రామంలో భూముల సర్వేలో అనేక అక్రమాలు జరిగాయని, మరీ ముఖ్యంగా వీఆర్ఏ, తలారి కుమారుడు ద్వారా సర్వేయర్ ఈ వసూళ్లు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రైతులకు హద్దులు చూపడంలో అధికారులు విఫలమయ్యారని, ఇది రైతుల భూస్వామ్య హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా జాయింట్ ఎల్‌పిఎం నంబర్ల తొలగింపులో ఆలస్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తద్వార రైతులు బ్యాంకులలో రుణాలు పొందడంలో, పంట బీమా, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాలు అందుకోవడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ముఖ్యంగా జాయింట్ ఎల్‌పిఎం నంబర్లను తొలగించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి యూసుఫ్, ఎస్.బాలరాజు, ఎస్.బాబు, పీవైఎల్ నాయకులు మునప్ప, షరీఫ్, రామచంద్ర, నరసన్న, ఆంజనేయులు, మల్లేష్, జై రాములు, నర్సింలు, శ్రీనివాసులు, లింగన్న, వెంకటేష్, భాష, కాజా మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేర్చాలి టిడిపి శ్రేణులకు సీఎం చంద్రబాబు దిశ నిర్దేశం




**ఆదోని,జులై25.అక్షరటైమ్స్:**- ఆస్పరి పర్యటన కు విచ్చేసిన ముఖ్యమంత్రి నారచంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికిన కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో గుడిసె ఆది కృష్ణమ్మ, ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, నీటి పారుదల శాఖ మంత్రి టి.జి. భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జోనల్ కోఆర్డినేటర్ పల్లికూరు శ్రీనివాస రెడ్డి, ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం అని పేర్కొన్నారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించి ప్రతి ఇంటికి చేర్చాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో మరింత బలమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ ఇన్‌ఛార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి ఇచ్చిన మార్గదర్శకాల మేరకు పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

## శ్రీ ఉరుకుందఈరన్న స్వామి దేవస్థానానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు : డిప్యూటీ కమిషనర్ వాణి

### ప్రధాన అర్చకుడిని విధుల నుంచి తొలగింపు- మరో 9 మందికి సోకజ్ నోటీసులు

### దేవస్థానం పరిరక్షణలో రాజీలేదు బాధ్యతలపై క్రమశిక్షణ చర్యలు తప్పవు: కే.వాణి డిప్యూటీ కమిషనర్



**కౌతాళం,జులై25.అక్షరటైమ్స్:**- కౌతాళంమండలం ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహ (ఈరన్న) స్వామి వార్ల దేవస్థానాన్ని ఎవరైనా భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని ఆలయ డిప్యూటీ కమీషనర్ అధికారి కే.వాణి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమీషనర్ మరియుకార్య నిర్వహణ అధికారి కే.వాణి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులతో ఈనెల 18 తేదీన దేవాలయం నందు సమన్వయ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశం నందు అన్యమతస్తులు పాల్గొనడం పై ఈనెల 20 తేదీన విరాట్ హిందుస్థాన్ సంఘం, విశ్వహిందూ పరిషత్ ఆదోని వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు దేవస్థానము పాలకమండలి చైర్మన్ తో చర్చించి, పరిశీలించగా ఇందుకు కారుకులైన ప్రధాన అర్చకులు జె.ఈరప్ప ను విధులు నుండి తొలగించడమైనది అని తెలిపారు. అలాగే 9 మందికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అందులో జే. మహాదేవప్ప,జే. మల్లయ్య ఉప ప్రధాన అర్చకులు మరియు ముఖ్య అర్చకులు జే.రమేష్,జి. మునీంద్ర కుమార్, సన్నాయి విద్వాస్, సి.రాముడు,తాళం విధ్వాస్,ఎస్. ఉమాశంకర్,డోలు విధ్వాస్, కే.వెంకటేశ్వరరావు, పర్యవేక్షకులు సి.కృష్ణవేణి, దేవాలయం ఇన్స్పెక్టర్లు వీరికి మెమొలు జారీ చేశామని వారు పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వ సంక్షేమాన్ని ఇంటింటికి చేర్చాలి

## టిడిపినాయకులు ఉమాపతి నాయుడు దిశానిర్దేశం





**ఆదోని,జూలై25.అక్షరటైమ్స్:**- ఆదోని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు గారి ఆధ్వర్యంలో వార్డు, గ్రామ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న డోర్ టు డోర్ కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అలాగే పార్టీ కార్యాలయం నుంచి అందిన ప్రచార సామగ్రిని వార్డు, గ్రామ నాయకులకు పంపిణీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమాపతి నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొంటూ, ప్రతినెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ ద్వారా వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్లు అందజేస్తోందని వారు తెలిపారు. తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, చేనేత కార్మికులకు పవర్‌లూమ్‌లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆటో డ్రైవర్లకు రూ.15,000 ఆర్థిక సహాయం, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు సంవత్సరానికి రూ.20,000 అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్ల ద్వారా కేవలం రూ.5కే పేదలకు భోజనం అందిస్తున్నామని తెలిపారు.అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ మరియు సీఎంఆర్ఎఫ్ ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు వైద్య ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మెగా డీఎస్సీ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని వారు పేర్కొన్నారు.ఈ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించి, కూటమి ప్రభుత్వ పనితీరును విస్తృతంగా తెలియజేయాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఉమాపతి నాయుడు సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.